క్లుప్తంగా

ఉత్తమ వీఓఏ అవార్డు అందుకున్న వనజ



అవార్డు అందుకుంటున్న వనజ

చిట్యాల: మండలంలోని వెలిమినేడు గ్రామానికి చెందిన వనజ ఉత్తమ వీఓఏ అవార్డును హైదరాబాద్‌లో బుధవారం రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క చేతులమీదుగా అందుకున్నారు. మనుషుల అక్రమ రవాణాపై గ్రామంలో వీఓఏ వనజ చేపట్టిన అవగాహన కార్యక్రమాలను గుర్తించి అంతర్జాతీయ మానవ అక్రమ రవాణా దినోత్సవం సందర్భంగా ఆమెను ఈ అవార్డుకు ఎంపిక చేశారు.

ఉగ్రవాదులను హతం చేయడం అభినందనీయం

నల్లగొండ టౌన్ : పహల్గాం దాడికి పాల్పడిన ముగ్గురు ఉగ్రవాదులను భారత సైన్యం మట్టుబెట్టడం అభినందనీయమని అఖిల భారత యాదవ సంఘం మాజీ సైనికుల రాష్ట్ర కన్వీనర్ జక్కుల శ్రీనివాస్‌యాదవ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ త్రివిధ దళాలకు స్వేచ్ఛ ఇవ్వడం వల్లనే ఇది సాధ్యమైందన్నారు.

రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా సైదులు



నియామక పత్రం అందుకుంటున్న సైదులు

నల్లగొండ టౌన్ : ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా వడ్డెబోయిన సైదులు నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు, మాజీ మంత్రి జి.సంజీవరెడ్డి నుంచి సైదులు నియామక పత్రాన్ని అందుకున్నారు.

దోస్త్ దరఖాస్తులకు నేడు చివరి తేదీ

చండూరు : డిగ్రీ కళాశాలలో దోస్త్ ఆన్‌లైన్ దరఖాస్తులకు గురువారం చివరి తేదీ అని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఘనశ్యామ్ తెలిపారు. విద్యార్థులు రూ.400 ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మర్రిగూడ : మండల కేంద్రంలోని కేజీబీవీలో హైస్కూల్, జూనియర్ కళాశాల విద్యార్థులకు 2025–26 విద్యా సంవత్సరంలో గెస్ట్ పద్ధతిలో విద్యాబోధన చేయడానికి మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కేజీబీవీ ప్రత్యేకాధికారిణి జ్యోతి బుధవారం తెలిపారు. కాలేజీలో బోధించడానికి ఇంగ్లిష్, జువాలజీ, పీజీ బీఈడీతోపాటు సంబంధిత సబ్జెక్టుల్లో అర్హత కలిగి ఉండి టెట్ క్వాలిఫై అయినవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అదేవిధంగా హైస్కూల్‌కు సంబంధించి పీఈటీ పోస్టుకు బీపీఈడీ అర్హత కలిగిన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. రెండు రోజుల్లో ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్‌లతో దరఖాస్తులు అందించాలన్నారు.

స్పాట్ అడ్మిషన్ల స్వీకరణ..

కేజీబీవీలో ఇంటర్ మొదటి సంవత్సరంలో బైపీసీ, ఎంపీసీ గ్రూపుల్లో ఖాళీ సీట్ల భర్తీకి అడ్మిషన్లు స్వీకరిస్తున్నామని కేజీబీవీ ప్రత్యేకాధికారిణి జ్యోతి తెలిపారు. బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

స్కూల్ బ్యాగుల పంపిణీ



స్కూల్ బ్యాగులతో విద్యార్థులు

నకిరేకల్ : మండలంలోని చందుపట్ల ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కడారి అనిత పదవీ విరమణ సందర్భంగా బుధవారం విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, పరీక్ష ప్యాడ్లను ఎంఈఓ మేకల నాగయ్య చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా అనితను ఉపాధ్యాయులు, గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో సీపీఎస్ హెచ్‌ఎం తంగెళ్ల శ్రీను, పాఠశాల చైర్మన్ వరలక్ష్మీ, ఉపాధ్యాయులు చిక్కుల సుధాకర్, సబిత, మూడుదుడ్ల పద్మ, కొండ లక్ష్మీ, శ్రీలత, సంధ్య, శోభ, మాజీ ఎంపీటీసీ ఇమడపాక లక్ష్మీ వెంకన్న, గోనె నర్సింహారావు, సిలివేరు శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సత్కారం

కేతేపల్లి: ఎన్నికల నిర్వహణపై విద్యార్థులు పాఠశాల స్థాయిలోనే అవగాహన పెంపొందించుకోవాలని కేతేపల్లి ఎస్‌ఐ సతీష్ అన్నారు. కేతేపల్లిలోని డీపాల్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ఇటీవల నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఎన్నికైన విద్యార్థులను బుధవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన 'స్లాష్'లతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. అనంతరం ఎన్నికైన విద్యార్థులతో ప్రమాణ స్వీకారం చేయించారు. పాఠశాల ప్రిన్సిపాల్ షాజుజార్జి, వైస్ ప్రిన్సిపాల్ రంజిత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్స్ బకాయిలపై నజర్

- నల్లగొండ పట్టణంలో 5వేలకు పైగా లైసెన్స్‌లు
- రూ.2 కోట్ల వరకు బకాయిలు
- ఆగస్టు 15లోగా చెల్లించకుంటే దుకాణాలు సీజ్!



నల్లగొండ టూటౌన్ : నీలగిరి పట్టణంలో ట్రేడ్ లైసెన్స్ తీసుకున్న దుకాణాల యాజమానులు లైసెన్స్ రుసుం చెల్లించకుండా జాప్యం చేస్తున్నారు. నల్లగొండ పట్టణంలో 5 వేలకు పైగానే కమర్షియల్ దుకాణాల వ్యాపార లావాదేవీలు కొనసాగుతున్నాయి. వీటిలో 5 వేల వరకు ట్రేడ్స్ లైసెన్స్‌లు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ట్రేడ్స్ లైసెన్స్ ద్వారా ఏడాది రూ.2.5 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు ఆదాయం వస్తున్నట్లు తెలుస్తోంది. ట్రేడ్ లైసెన్స్ రుసుం కోసం మున్సిపల్ సిబ్బంది దుకాణాల వద్దకు తిరుగుతున్నా రుసుం చెల్లించకుండా తిప్పుకుంటున్నారు. లైసెన్స్ రుసుం చెల్లించకపోవడంతో రూ.2 కోట్ల వరకు బకాయిలు పేరుకుపోయాయి. ఈ బకాయిలను వసూలు చేయడంపై మున్సిపల్ యంత్రాంగం నజర్ పెట్టింది. ఎక్కువ మంది సిబ్బందిని పెట్టి ట్రేడ్ లైసెన్స్ రుసుం వసూలు చేయాలని నిర్ణయించారు. వ్యాపార లావాదేవీలు నిర్వహించే ప్రతి దుకాణదారుడు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ పొందాల్సి ఉంటుంది. లైసెన్స్ తీసుకున్నవారు ప్రతి ఏడాది రుసుం చెల్లించాల్సి ఉన్నా సంబంధిత వ్యాపారులు కొందరు పెడచెవిన పెడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రుసుం వసూలు కోసం వెళితే సాకులు చెప్పడం, రేపు, మాపు అని తిప్పుతూ కాలయాపన చేస్తున్నట్లు మున్సిపల్ సిబ్బంది చెబుతున్నారు. ఇకనుంచి అలా కాకుండా ట్రేడ్ లైసెన్స్ రుసుంపై సీరియస్‌గా ఉండాలని మున్సిపల్ యంత్రాంగం నిర్ణయం తీసుకుంది. మున్సిపాలిటీకి వచ్చే పన్నులపై ప్రత్యేక ఫోకస్ పెట్టడం ద్వారా ఆదాయ వనరులు పెంచుకోవాలనే ఆలోచనలో అధికారులు ఉన్నారు.

సిబ్బందిని ఖాతరు చేయని దుకాణదారులు..

నీలగిరి పట్టణంలో ఉన్న 5 వేలకు పైగా దుకాణదారుల్లో కొంతమంది క్రమం తప్పకుండా ట్రేడ్ లైసెన్స్ రుసుం చెల్లిస్తున్నారు. మరి కొందరు మాత్రం మున్సిపల్ సిబ్బందిని ఖాతరు చేయకుండా దుకాణాల చుట్టూ తిప్పుకుంటున్నట్లు అధికారుల దృష్టికి వచ్చింది. ఇకనుంచి అలా కాకుండా మొదట ట్రేడ్ లైసెన్స్ రుసుం చెల్లించాలని దుకాణదారులకు సమాచారం ఇస్తారు. తరువాత కూడా చెల్లించకపోతే దుకాణాలు సీజ్ చేయాలని మున్సిపల్ అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం మున్సిపాలిటీలకు పాలకవర్గాలు కూడా లేకపోవడంతో పన్ను వసూళ్లపై అంతగా ఒత్తిళ్లు వచ్చే అవకాశాలు కూడా తక్కువగా ఉంటుంది. ట్రేడ్ లైసెన్స్ బకాయి పడ్డ వారు ఆగస్టు 15లోగా రుసుం చెల్లించకుంటే ఆ తరువాత నుంచి దుకాణాలను సీజ్ చేయడానికి అధికారులు సిద్ధం అవుతున్నారు. ఈలోగా సాధ్యమైనంత ఎక్కువగా ట్రేడ్ లైసెన్స్ రుసుం వసూలు పూర్తి చేయాలని మున్సిపల్ యంత్రాంగం భావిస్తోంది.

అభివృద్ధికి సహకరించాలి

నల్లగొండ పట్టణ ప్రజలు మున్సిపాలిటీకి పన్నులు సకాలంలో చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలి. వ్యాపారం చేసే ప్రతిఒక్కరూ ట్రేడ్ లైసెన్స్ రుసుం చెల్లించాలి. రుసుం చెల్లించకుంటే చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం.

– సయ్యద్ ముసాబ్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నార్కట్‌పల్లి : మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన శ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం గురుజా అశోక్ స్వామి ఆధ్వర్యంలో బేతోజు సత్యనారాయణ శాస్త్రి సిద్ధాంతి బుధవారం వైభవంగా నిర్వహించారు. గణపతి పూజ, అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం, శాంతి కల్యాణాన్ని అర్చకులు వేద మంత్రాలతో జరిపించారు. వేడుకల్లో ఎమ్మెల్యే వేముల వీరేశం–పుష్ప దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వారికి ఆశీర్వచనాలు అందజేసి సన్మానించారు. వేడుకల్లో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఉషయ్య, దూదిమెట్ల సత్తయ్య, సలీం, స్వామి, సిద్దగోని స్వామి, బింగి కొండయ్య, పుల్లెంల ముత్తయ్య, గడ్డం పశుపతి, ప్రజ్ఞాపురం రామకృష్ణ, ప్రజ్ఞాపురం సత్తి, కొండ సైదులు, పద్మావతి, గురుజ రామచంద్రు, క్రాంతికుమార్, మధు, వడ్డెగోని రామలింగయ్య, బింగి మహేష్, మాదాసు నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

నూతన విధానంలో పెన్షన్ల పంపిణీ



దోనిపాములలో పెన్షన్ల పంపిణీ పరిశీలిస్తున్న ఎంపీడీఓ యాదగిరి

చండూరు : నూతన విధానంలో పెన్షన్లు పంపిణీ చేసేందుకు ఎఫ్‌ఆర్‌ఎస్ సాఫ్ట్‌వేర్ ఎంతగానో ఉపయోగపడుతుందని ఎంపీడీఓ బండారు యాదగిరి అన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన సాక్షితో మాట్లాడారు. గతంలో పెన్షన్ల పంపిణీలో దాదాపు 25శాతం మంది వృద్ధులకు వేలిముద్రలు రాని కారణంగా పోస్టాఫీస్ వరకు రాలేకపోవడంతో పంచాయతీ కార్యదర్శులు ధృవీకరణ ద్వారా కుటుంబ సభ్యులకు పంపిణీ చేసేవారని తెలిపారు. అయితే ఎటువంటి అవకతవకలు జరగకుండా ఉండేందుకు ప్రభుత్వం ఫేషియల్ రికగ్నిషన్ సాఫ్ట్‌వేర్‌ను ప్రారంభించిందన్నారు. లబ్ధిదారుల ముఖాన్ని గుర్తించడం ద్వారా కానీ, వేలిముద్రల ద్వారా కానీ పెన్షన్ పంపిణీ చేస్తారన్నారు. ఈ రెండు విధాలుగా రాకపోతే అప్పుడు పంచాయతీ కార్యదర్శి ధృవీకరణ ద్వారా ఆ లబ్ధిదారులకు పెన్షన్‌లు పంచుతారని అన్నారు. ఈ ఒక్క నెల మాత్రమే పంచాయతీ కార్యదర్శులు పెన్షన్ పంపిణీ చేస్తారని, తరువాతి నెల నుంచి పోస్ట్‌మాస్టర్‌లే పెన్షన్ పంపిణీ చేస్తారని తెలిపారు. పోస్ట్‌మాస్టర్‌కు రూ.20వేల విలువ చేసే 5 జీ ఫోన్ ఇస్తారని, దాని ద్వారా వృద్ధులకు ఇంటింటికి వచ్చి పెన్షన్ ఇస్తారని వివరించారు. ముందుగా చండూరు మండలంలోని పలు గ్రామాల్లో ఎంపీడీఓ యాదగిరి, ఎంపీఓ మాధవరెడ్డి పెన్షన్ల పంపిణీ పరిశీలించారు.

స్థానిక ఎన్నికల్లో వైశ్యుల వాటా తేల్చాలి



మాట్లాడుతున్న కాచం సత్యనారాయణ

నకిరేకల్ : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైశ్యుల వాటా తేల్చాల్సిందేనని వైశ్య సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కాచం సత్యనారాయణ గుప్తా అన్నారు. ఆగస్టు 3న హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జరగబోయే వైశ్య రాజకీయ రణభేరిని విజయవంతం చేయాలని కోరుతూ రూపొందించిన ప్రచార పోస్టర్‌ను బుధవారం నకిరేకల్ పట్టణంలోని వైశ్య భవన్‌లో ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ ఈడబ్ల్యూఎస్‌లో వర్గీకరణ తేవాలన్నారు. నామినేటెడ్ పదవుల్లో వైశ్యులకు తగిన ప్రాధాన్యత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. సంఘం మండల అధ్యక్షుడు గజ్జల రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వాసవి సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీకాకోళ్ల మిధున్, సంఘం పట్టణ అధ్యక్షుడు వీరవెల్లి రఘునాథ్, ఉప్పల సంతోష్, బుక్క ఈశ్వరయ్య, లక్ష్మీశెట్టి శ్రీనివాస్, కోటగిరి దైవదీనం, సోమ యాదగిరి, మంచుకొండ సోమయ్య, గుండా వెంకటయ్య, మురారిశెట్టి కృష్ణమూర్తి, ఉప్పల రమేష్, వీర్లపాటి జానయ్య, రేపాల సతీష్, గుండా నరేందర్, వీర్లపాటి నర్సింహారావు, తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 2 నుంచి సైకిల్ యాత్ర

చిట్యాల: కల్లు గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి ఆగస్టు 2వ తేదీ నుంచి 18వ తేదీ వరకు కల్లు గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో సైకిల్ యాత్ర చేపట్టనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పామనగుళ్ల అచ్చాలు తెలిపారు. చిట్యాలలో బుధవారం జరిగిన కల్లు గీత కార్మిక సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నార్కట్‌పల్లి మండలం ఔరవాణి గ్రామంలోని బైరు మల్లయ్య విగ్రహం వద్ద నుంచి సైకిల్ యాత్ర ప్రారంభమై జిల్లాలోని వివిధ గ్రామాల మీదుగా కొనసాగుతూ ఆగస్టు 18వ తేదీన సర్వాయి పాపన్నగౌడ్ జయంతి రోజున నల్లగొండలో ముగుస్తుందన్నారు. మామిడి హనుమంతు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గుణగంటి కృష్ణయ్య, నకిరేకంటి రాములు, గుణగంటి సైదులు, నాతి వెంకట్రామయ్య, ఊడుగు సత్తయ్య, పాలకూరి వెంకన్న, వెంకటయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక

చిట్యాల: మండలంలోని ఉరుమడ్ల గ్రామ పంచాయతీ మాజీ ఉప సర్పంచ్ ఉయ్యాల లింగయ్య, సైదులుతోపాటు మరికొందరు బుధవారం హైదరాబాద్‌లో డైయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి అమిత్‌రెడ్డి కండువాలు కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ కోనేటి యాదగిరి, జనపాల శ్రీను, కురుపాటి లింగయ్య పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్ల పట్టాలు ఇవ్వాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్: డబుల్ బెడ్‌రూం లబ్ధిదారులకు వెంటనే ఇళ్ల పట్టాలను అందజేయాలని కోరుతూ సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎండీ.సలీం, పట్టణ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య ఆధ్వర్యంలో బుధవారం ఆర్డీఓ అశోక్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ 2017 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం పట్టణంలో ఇల్లు లేని పేదల కోసం డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించిందని తెలిపారు. 2023లో పేదల నుంచి దరఖాస్తులు స్వీకరించి అర్హులను ఎంపిక చేశారన్నారు. కానీ ఇప్పటివరకు వారికి ఇళ్లు స్వాధీనం చేయకుండా జాప్యం చేస్తున్నారని, వెంటనే లబ్ధిదారులకు ఇళ్లు స్వాధీనం చేయాలని కోరారు. కార్యక్రమంలో అవుట రవీందర్, గంజి నాగరాజు, ప్రశాంతి, రాజేష్, గౌసియా, సిరాజుద్దీన్, విజయలక్ష్మి, జయమ్మ, వెంకటమ్మ, లక్ష్మి, వెంకటేశం, గిరిజ, లాజర్, పార్వతి, జాన్సన్, చెన్న కేశవులు పాల్గొన్నారు.

రాజకీయంగా అణగదొక్కే కుట్ర చేస్తున్నారు



మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ రఘుమారెడ్డి

చిట్యాల: విద్య, రైతుల సమస్యలపై పోరాటం చేస్తూ రాజకీయంగా ఎదుగుతున్న తనను అణగదొక్కేందుకు మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అనవసర ఆరోపణలు చేస్తున్నారని వెలిమినేడు పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు రఘుమారెడ్డి అన్నారు. చిట్యాలలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులకు అందాల్సిన యూరియా పక్కదారి పడుతున్నట్లు తనకు తెలియడంతో నాలుగు రోజుల క్రితం పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. యూరియా అక్రమ రవాణపై విచారణ జరుగుతున్న సమయంతో తనపై విమర్శలు చేయడం బీఆర్‌ఎస్ నాయకులకు తగదన్నారు. రైతుల సంక్షేమం కోసం సొసైటీ ఆధ్వర్యంలో తాను చేపట్టిన అభివృద్ధిపై బహిరంగ సభలో వెల్లడిస్తానని, తాను చేసిన అవినీతిని బీఆర్‌ఎస్ నాయకులు వెల్లడించాలని సవాల్ విసిరారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుడిపాటి లక్ష్మీనర్సింహ, ఏఎంసీ మాజీ చైర్మన్ కాటం వెంకటేశం, పీఏసీఎస్ డైరెక్టర్ మామిడి శ్రీరాములు, సుర్కంటి సత్తిరెడ్డి, కాటం సత్తయ్య, టేకుల సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు కారకులను శిక్షించాలి

నల్లగొండ టౌన్ : శ్రీలత ఆత్మహత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించి శ్రీలత కుటుంబానికి తగిన న్యాయం చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పాలడుగు నాగార్జున, మహనీయుల ఆశయ సాధన సేవా సంఘం గౌరవాధ్యక్షుడు కత్తుల షణ్ముఖకుమార్, అధ్యక్షుడు కత్తుల జగన్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం శ్రీలత కుటుంబ సభ్యులను వారు పరామర్శించి మాట్లాడారు. కార్యక్రమంలో కందుల లక్ష్మయ్య, శివరామకృష్ణ, వంటపాక యాదగిరి, పెరిక అంజయ్య, గిరిప్రసాద్, హరిప్రసాద్, చిట్టి, విజయ్ పాల్గొన్నారు.

ఆత్మహత్యకు ప్రయత్నించిన వ్యక్తి మృతి



ధర్నా నిర్వహిస్తున్న కుటుంబ సభ్యులు, బీజేపీ నేతలు

నల్లగొండ : పట్టణంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించిన రావెళ్ల నర్సింహ హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. రావెళ్ల నర్సింహ సోమవారం రాత్రి మద్యం సేవించి దేవరకొండ రోడ్డులో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పోలీసులకు చిక్కాడు. దీంతో కేసు నమోదు అవుతుందని భయపడి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. పోలీసులు మంటలు ఆర్పి ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల విధులకు ఆటంకం కలిగించినందుకు అతడిపై కేసు కూడా నమోదు చేశారు.

మృతుడి బంధువుల ధర్నా

నల్లగొండ పట్టణంలోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఆత్మహత్యకు ప్రయత్నించిన రావెళ్ల నర్సింహ కుటుంబ సభ్యులు పాత బస్తీ చౌరస్తాలో బుధవారం ధర్నా నిర్వహించారు. పోలీసులు కావాలనే ఇబ్బందులకు గురిచేసి మనస్థాపానికి గురయ్యే విధంగా చేశారని ఆరోపించారు. ఆత్మహత్యాయత్నానికి కారణమైన ఎస్‌ఐ సైదులును సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, మాదగోని శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్, ఆన్‌లైన్ బెట్టింగ్‌లను అరికట్టాలి



నల్లగొండ టౌన్: మాట్లాడుతున్న మల్లం మహేష్

నల్లగొండ టౌన్ : గంజాయి, డ్రగ్స్, ఆన్‌లైన్ బెట్టింగ్‌ను అరికట్టాలని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో చేపట్టిన సైకిల్ యాత్ర 7వ రోజు నల్లగొండ పట్టణంలోని రామగిరిలో సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్, ఆన్‌లైన్ బెట్టింగ్‌లపై యువత, విద్యార్థుల్లో అవగాహన కల్పించడానికి సైకిల్ యాత్ర నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పుల్లెంల శ్రీకర్, గుండాల నరేష్, గద్దపాటి సుధాకర్, మహేష్, శశిధర్, రాజేష్, కార్తిక్, వేణు, గోపి, మల్లేష్, ఆంజనేయులు లింగరాజు, రాము, గణేష్, సాయితేజ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి అరికట్టాలని సైకిల్ యాత్ర

తిప్పర్తి : గంజాయి, డ్రగ్స్ అరికట్టాలని కోరుతూ డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా చేపట్టిన సైకిల్‌యాత్ర 7వ రోజు తిప్పర్తి మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్ మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ వినియోగం వల్ల జరిగే అనర్థాలపై యువతకు అవగాహన కల్పించేందుకు డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో సైకిల్ యాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జంజరాల సైదులు, గణేశ్, పుల్లెంల శ్రీకర్, నరేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బాల్యంలోనే లక్ష్యాన్ని ఎంచుకోవాలి



డైరీలతో విద్యార్థులు

నకిరేకల్: విద్యార్థులు బాల్యంలోనే లక్ష్యాన్ని ఎంచుకోవాలని ఎంఈఓ మేక నాగయ్య సూచించారు. నకిరేకల్ మండలం తాటికల్ జెడ్పీ హైస్కూల్‌లో నల్లగొండ లయన్స్ గోల్డ్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన యువ వికాస కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు డైరీలు, పెన్నులను ఆయన అందజేసి మాట్లాడారు. మోటివేషన్ స్పీకర్ కోట్ల సాయికిరణ వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్‌పై శిక్షణ ఇచ్చారు. క్రమశిక్షణ, పెద్దలను గౌరవించడం, దురలవాట్లకు దూరంగా ఉంటూ దేశభక్తిని కలిగి ఉండాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు చొక్కక్ల రవీంద్రచారి, ఎద్దు శ్రీనివాస్, కన్నెగంటి శ్రవణ్, ఉపాధ్యాయులు పండగ తిరుమలయ్య, మోసంగి హరిచంద్ర, మార్త రాములు, సాగర్ల సత్తయ్య, నర్రా వెంకట్‌రెడ్డి, లొట్లపల్లి కోటయ్య, నూకల జానయ్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

నకిరేకల్ : మండలంలోని చందుపట్ల గ్రామంలో ఇటీవల మృతి చెందిన జిల్లా వెంకటయ్య కుటుంబానికి బీజేపీ మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం బీజేపీ సీనియర్ నాయకుడు యానాల శంకర్‌రెడ్డి 50 కేజీల బియ్యంతోపాటు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బుడిగె సైదులు, జిల్లా డాకయ్య, యానాల శ్రీనివాస్‌రెడ్డి, తాటికొండ రామ్మూర్తి, పుట్ట వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

శాలిగౌరారం ప్రాజెక్టు పరిశీలన

శాలిగౌరారం: జిల్లాలో మధ్యతరహా ప్రాజెక్టుల్లో ఒకటైన శాలిగౌరారం ప్రాజెక్టును సూర్యాపేట జిల్లా తిరుమలగిరి డివిజన్ నీటి పారుదల శాఖ ఈఈ సత్యనారాయణ బుధవారం పరిశీలించారు. ప్రాజెక్టు కట్ట, ఆయకట్టుకు సాగునీరును అందిస్తున్న ప్రధాన కుడి, ఎడమ కాల్వలు, ఆయా కాల్వలపై ధ్వంసమైన పంట కాల్వల షట్టర్లను పరిశీలించారు. వరదనీటితో కోతకు గురైన ప్రాజెక్టు కట్ట, ప్రాజెక్టు కట్టపై నిర్మించిన గైడ్ సీసీ వాల్‌కు ఏర్పడిన పగుళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రాజెక్టు అభివృద్ధి కోసం నిధులు మంజూరైనప్పటికీ సంబంధిత కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయన్నారు. కాంట్రాక్టర్‌కు పలుమార్లు నోటీసులు జారీ చేశామని, సంబంధిత కాంట్రాక్ట్‌ను రద్దుచేసి ప్రాజెక్టు అభివృద్ధి పనులను చేపట్టేందుకు రీ టెండరింగ్ చేపడతామన్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 17.5 అడుగుల నీటి మట్టం ఉందన్నారు. ఆయన వెంట నీటి పారుదల శాఖ ఏఈఈ విక్రమ్, చంద్రశేఖర్, ఏఈ జైహరి, అఖిల్‌కుమార్, రైతు ప్రతినిధి చామల వెంకటరమణారెడ్డి ఉన్నారు.

పాఠశాలలో వన మహోత్సవం



మొక్కలు నాటుతున్న అటవీశాఖ అధికారులు

మర్రిగూడ: వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా బుధవారం మర్రిగూడ మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో మునుగోడు రేంజ్ అటవీశాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అటవీ శాఖ సెక్షన్ ఆఫీసర్ బి.అఖిలేష్ మాట్లాడుతూ విద్యార్థులు పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీట్ ఆఫీసర్ ఉదయ్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వెంకటేష్‌గౌడ్, పీడీ రాం నరేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

పదవీ విరమణ పొందిన పోలీసులకు సన్మానం



పదవీ విరమణ పొందినవారిని సన్మానిస్తున్న ఎస్పీ

నల్లగొండ : పోలీసు శాఖలో దాదాపు 38 సంవత్సరాలపాటు పనిచేసి పదవీ విరమణ పొందిన ఏఎస్‌ఐలు దేవసాయం, ప్రభాకర్‌రెడ్డిలను జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ శరత్‌చంద్ర పవార్ బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ దేవసాయం, ప్రభాకర్‌రెడ్డి సేవలు, అనుభవాలు పోలీస్ శాఖకు చాలా అవసరం అన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా ఎల్లప్పుడు తాను అండగా ఉంటానని అన్నారు. అనంతరం వారికీ అందాల్సిన ఆర్థిక సదుపాయాలను అందజేశారు. కార్యక్రమంలో పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు జయరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాకారిణులను సన్మానం



క్రీడాకారిణులను సన్మానిస్తున్న గుమ్ముల మోహన్‌రెడ్డి

నల్లగొండ: నార్వేలో జరుగనున్న స్లంసాకర్ హోమ్‌లెస్ ఇంటర్నేషనల్ వరల్డ్ కప్ పోటీలకు జిల్లా నుంచి ఎంపికైన క్రీడాకారిని లావణ్య, ఫిఫా అకాడమికి ఎంపికైన క్రీడాకారిణి పవిత్రను బుధవారం మంత్రి కోమటిరెడ్డి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో ఫుట్‌బాల్ కోచ్ కే. దాసు, సునీత, రజిత, రఫీ, జాతీయ స్థాయి క్రీడాకారులు సిద్దార్థ, సోనీ, సాగర్ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

కేతేపల్లి: మండలంలోని కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద 65 నంబరు జాతీయ రహదారిపై బుధవారం జిల్లా మోటార్ వెహికల్స్, ఆర్టీసీ అధికారులు సంయుక్తంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. వ్యక్తిగత వాహనం పేరుతో రిజిస్ట్రేషన్ చేయించి ప్రయాణికులను అక్రమంగా తీసుకెళ్తున్న వాహనాలను గుర్తించి కేసులు నమోదు చేసి జరిమానాలు విధించారు. ఆయా వాహనాల్లోని ప్రయాణికులను కిందకు దింపి ఆర్టీసీ బస్సుల్లో ఎక్కించి వారి గమ్యస్థానాలకు పంపించారు. తనిఖీల్లో ఆర్టీఏ అధికారి ఖలీల్ ఉల్లాఖాన్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, సిబ్బంది కేఎస్‌రెడ్డి, నర్సింహ పాల్గొన్నారు.

ఉచిత మెగా కంటి వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

కేతేపల్లి: మండలంలోని గుడివాడ గ్రామంలో బుధవారం నకిరేకల్ లయన్స్ క్లబ్, నవ్య క్లబ్ వారి సంయుక్త ఆధ్వర్యంలో సూర్యాపేట లయన్స్ కంటి ఆస్పత్రి వారి సహకారంతో ఉచిత మెగా కంటి, డయాబెటిక్ వైద్య శిబిరం నిర్వహించారు. దృష్టి లోపం ఉన్న 90 మందికి కంటి పరీక్షలు, 59 మందికి డయాబెటిక్, బీపీ పరీక్షలు నిర్వహించారు. 8 మందికి కంటి ఆపరేషన్ అవసరమని గుర్తించిన వైద్యులు ఉచితంగా ఆపరేషన్ చేయించేందుకు సూర్యాపేట కంటి ఆస్పత్రికి తరలించారు. క్లబ్ అధ్యక్షులు రేపాల సతీష్, ఎస్.రమాదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎస్‌కే.లతీఫ్, లయన్స్ ట్రస్టు చైర్మన్ ఎస్.రామ్మోహన్‌రావు, క్లబ్ కార్యదర్శి సూర్యచందరావు, ఉప్పల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

యూనిఫాం అందజేత

కట్టంగూర్ : ప్రభుత్వం సరఫరా చేసిన యూనిఫాంను మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు ఎంఈఓ అంబటి అంజయ్య బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ వసతి గృహాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. సంక్షేమ అధికారి గుజ్జుల శంకర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.